# ఇది కూడా ఖరీదే

సినీతారలంటే మోజు ఒక క్రానిక్ డిసీజ్ లాంటిది. అది కొంత మందికే కాదు జనాభాలో ఎక్కువ మందికి వ్యాపించడం విశేషం.

ఇద్దరు సినీతారలు షూటింగ్‌కి ఆ ఊరు వచ్చారు. ఒకామె కాంతిశ్రీ మరొకామె శాంతిశ్రీ.

ఆకాశంలోంచి నక్షత్రం జారిపడిందంటే ఎలా వుందో చూద్దామని జనం పరుగెత్తినట్లే, సినీతార తమలాగే మనిషే అయినా వేలంవెర్రి జనం వాళ్ళకోసం తెగ తాపత్రయపడిపోతారు. చదువుకునే పిల్ల అయితే ఆటోగ్రాఫ్‌లని వేధిస్తారు. పిచ్చి అభిమానులైతే రూపాయనోట్లు మీద వాళ్ళ సంతకాలు పెట్టించుకుని, ఆ నోట్లు ఖర్చుపెట్టకుండా వుంచుకోడం కూడా జరుగుతూంటుంది.

ఒక కాలేజీలో షూటింగ్ జరుగుతోంది. విద్యార్థినీ విద్యార్థులు తారల సంతకాల కోసం, వాళ్ళని చూడడం కోసం తాపత్రయ పడుతున్నారు.

కాంతిశ్రీ చుట్టూ విపరీతంగా జనం వున్నారు. చాలా కష్టం మీద అందరికి ఆటోగ్రాఫ్‌లు పెడుతోందామె.

శాంతిశ్రీ దగ్గరకు ఎక్కువమంది వెళ్ళడం లేదు.

ఈలోగా పత్రికా విలేకరులు వచ్చారు.

శాంతిశ్రీ దగ్గిరకు వచ్చారు ముందు.

"కుమారి శాంతిశ్రీగారూ! సినీ ఫీల్డులోకి నిన్నగాక మొన్న వచ్చిన కాంతిశ్రీగారికి దగ్గరకు ఆటోగ్రాఫ్ కోసం అంతమంది వెళ్తున్నారు. సినీ లోకంలో మీరు బిజీస్టార్ కదా! మీ దగ్గరకు ఎందుకు ఎక్కువమంది రావడం లేదు?" అంటూ మొదటి ప్రశ్న వేశారు.

"ఈ ఆటోగ్రాఫ్‌లు ఇచ్చేటప్పుడు అభిమానులు నన్ను క్రిందపడేసిన సంఘటనలు కూడా వున్నాయి. నేను పిచ్చిగీత పెట్టినా సంతోషిస్తారు. అందుకని నాతో ఆటోగ్రాఫ్ చేయించుకున్నవాళ్ళు పది రూపాయలు ఇవ్వా

లని నా సెక్రటరీచేత అందరికి చెప్పించాను. చూడండి ఏదైనా ఉచితంగా వస్తుందంటే జనం ఎగబడతారు. అదే పది పైసలు పెట్టి కొనాలంటే ఆలోచిస్తారు. నేను ఈ ఆటోగ్రాఫ్‌ల ద్వారా వచ్చిన డబ్బు అనాథ శరణాలయాలకు ఇచ్చేస్తున్నాను. ఇది తప్పంటారా?'' అందామె.

''వెల్‌డన్! శాంతిశ్రీగారూ అంటూ విలేకరులు కాంతిశ్రీ వేపు వెళ్లారు.

—0—

# పందెం

అది లేడీస్ హాస్టల్. ఆ గదిలో నాలుగు మంచాలు వున్నాయి. గదిలో అమ్మాయిలు ఒకటే అల్లరి చేస్తున్నారు. ఎవరు ఏం మాట్లాడుతున్నారో వినపడడంలేదు. ఒక అమ్మాయి పంజాబీ డ్రస్, మరో అమ్మాయి మేక్సీ, ఇంకో అమ్మాయి చీర కట్టుకుంది. మరో చిలిపి అమ్మాయి మిడీ వేసుకుంది. ఆ గది విచిత్ర వేషధారణ ప్రదర్శనలా వుంది.

ఇంతలో ఒక అమ్మాయి దగ్గు వినపడింది. అటు చూశారు. గుమ్మంలో ఒక అమ్మాయి నిలబడి వుంది. మా అక్కయ్య రమ వుందాండి'' అందా అమ్మాయి చచ్చే సిగ్గుతో.

''ఒక గంట క్రితమే వెళ్ళిందే. నీకు కనపడలేదా?''

''ఇవాళ మొదటాటకి సినిమాకి వెళ్దాం రమ్మందండీ. మా వూరి నుండి వచ్చానండి, టిక్కెట్లు కూడా తెచ్చాను.''

''ఏ సినిమాకి''

''రాక్షసుడండి. మాకు చిరంజీవి అంటే చాలా ఇష్టం.''